# తెరమీద బొమ్మలు

"ఎవరా పోయేది?"

ఆ పూరింటి పంచలో గుంజకానుకుని కూర్చున్న సీతమ్మ చెయ్యి వారగా పెట్టుకుని కళ్ళు చికిలించి వీధి వయిపు చూస్తూ అంది.

"వోరూ సూరమ్మా? సూశావా సూరమ్మా, నీవు అత్తా అనేదాక మనిషి వివరమే కానకపోయా. మాయదారి సూపు బొత్తిగా ఆనటంలేదు సూరమ్మా" వంగినోయిన నడ్డినిరెండుచేతులతో పట్టుకుని లేవలేక లేస్తూ అంది.

"పెద్దతనమాయిరి-" అంది సూరమ్మ.

"పెద్దతనం కాదంటమ్మా? మూడు ఉప్పెనలు సూశా! అన్నట్టు నీకు సెప్పనేలేదు. నేను అయిదరాబాదుకు పోతున్నానే కోడలా?" అంది.

సూరమ్మ ఆశ్చర్యంగా, "ఎట్టా?" అంది.

"అవునే, మా చిన్నోడు వుత్తరం ఏశాడు. రేపాదారం నాడు వచ్చి నన్ను అయిద్రాబాదు తీసుకుపోతానని రాశాడు. ఆడ పెద్ద పెద్ద ఆసుపత్తుర్లూ, పెద్ద పెద్ద డాక్టేర్లూ వున్నారట. ఈపాడు వుబ్బసం రోగానికి కొత్త మందు లొచ్చాయంట. నన్ను తీసికెళ్ళి ఆడే వయిద్దెం సేపిస్తానన్నాడు" అంది గర్వంగా తనలో తాను మురిసిపోతూ.

"పోన్లే అత్తా, ఇన్నాళ్టికి నిన్ను తీసికెళ్ళటానికి మీ చిన్నోడు వత్తున్నాడు. నీకేంలే అమ్మా, రామలచ్చంలు లాగా యిద్దరు కొడుకులున్నారు - ఒకడు చెన్నాపట్టంలో, మరోడు అయిదరాబాదులో' అంది కాస్త దిగులుగా. పాపం, సూరమ్మ కందరూ ఆడపిల్లలే!

సీతమ్మ, "ఎవరా మడిసి. మిద్దిల్లు రంగయ్యేనా..." అని సూరమ్మను వదిలేసి రంగయ్యను కేకేసింది. రంగయ్యతో తన చిన్నకొడుకు తనను హైదరాబాదుకు తీసికెళ్ళబోతున్న సంగతిని ఎంతో గొప్పగా, గర్వంగా చెప్పుకుంది.

ఈ విధంగా ఆ రోజంతా సీతమ్మ ఆ వీధిన పొయ్యే వాళ్ళను పేరుపేరునా కేకేసి పిలిచి, ఈ సమాచారాన్ని సగర్వంగా అందరికీ చెప్పుకుంటూనే వుంది; ప్రయాణ సన్నాహాలు చేస్తూ యిల్లంతా సవరిస్తూనే వుంది. హైదరాబాదుకు కొడుకు యింటికి తీసికెళ్ళడానికి కందులనీ, మినుములనీ, పెసలనీ మూటలు కట్టింది. కొడుకు పిల్లల కోసం ఎదురింటి పాపాయమ్మను బ్రతిమలాడి మినపసున్నుండలు

చేయించింది. వూరు తీసికెళ్ళటానికి దిబ్బమీద మాణిక్యం యింటికెళ్ళి రెండు లేత సొరకాయలు అడిగి కోయించి తీసికొచ్చింది. సూడిపడ్డను వెనుక ఇంటి రాములమ్మకు మేపుకున్ని పాడిచేసుకోమని యిచ్చేసింది. దానికోసం పెట్టిన గడ్డివామును కూడా రావులమ్మకేవూరికే యిచ్చేసింది. తనకు వంటా అదీ చేసిపెడుతూ, తన మంచీ చెడ్డా చూసే పక్కింటి నాంచారమ్మ కూతురు కనకంకు తన వాముల దొడ్లో వేసిన బంతిచెట్లను, వంగ మొక్కలను, చిక్కుడు పందిరిని అప్పగించింది. ఆ చెట్లకు నీళ్ళు అవీ పోసి, వాటికి కాసే పూలూ, కాయల్ని కోసుకోమని చెప్పింది. తను లేనప్పుడు వాకిట ముంగిట చిమ్మి, కాస్త ముగ్గుకర్ర వెయ్యమని చాకలి మంగలికి పురమాయించి, ప్రతిఫలంగా ఉప్పు గోంగూర వూరగాయ జాడీని యిచ్చేసింది.

పొలంకు బండి కట్టుకెళ్ళుతున్న చౌదరి గారి బుల్లియ్యను బ్రతిమాలి పట్టుకొచ్చి, గాదెలో వడ్లన్నీ బయటికి తీసి బండిలో మిల్లుకేసికెళ్ళి మరేయించుకురమ్మని పురమాయించింది.

వున్న యిద్దరూ కొడుకులూ ఎవరి భాగం వాళ్ళు పంచుకోగా తన వాటాకి వచ్చిన ఒక ఎకరం చెక్కనూ కౌలు కిచ్చుకుంది; కౌలు కింద వచ్చే ఆ పంట గింజలే ఆమెకు జీవనాధారం. అవి ఆమె ఒక్క దానికీ ఎక్కీ తక్కీ, తను తినగా ఒకళ్ళకింత పెట్టుతుంది. ఆమెది మొదట్నుంచీ భారీ చెయ్యి, ఎప్పుడూ ఎవరో ఒకళ్ళకు పెట్టాలనే వుంటుందామెకు. ఆమె చేతి పెట్టు తెల్సి జరుగుబాటు అంతంత మాత్రంగా వున్న ఆ వాడకట్టు అమ్మలక్కలు ఆమెకు అవీ ఇవీ పనులు చేసిపెడుతూ, ఆమె సహాయాన్ని పొందుతుంటారు.

"నీయమ్మ ఏంటే ముసల్దానా, పొలంకు ఎరువు తోలాలంటే నన్ను నీవు పట్టుకొచ్చావు!" అని నసుక్కున్నాడు బుల్లియ్య.

"నసుగుతావేంరా లమ్డీ కొడకా! మా ముసలాయన ఎవసాయం సేత్తున్న రోజుల్లో మీ తాత మాకాడ పెద్ద జీతగాడుగా సేశాడురా ఎదవ సచ్చినాడా!" అని చతురాడుతూ గాదెలో వడ్లన్నీ మూడు బస్తాల కెత్తించింది.

"నీయమ్మ ఏందే. గాదెలా వున్న వడ్లన్నీ పట్టిత్తున్నావు. అన్నీ అయిదరాబాదుకు తీసికెళ్ళితే మరి నీకు తిండి గింజలెట్టాగే!" అన్నాడు బుల్లియ్య.

"ఓరి ఎర్రి మొకమా, నేను ఇంకాడే వుంటారా! నాకేరే తిండి గింజలెందుకురా ఎర్రి సన్నేసి?" అంది గర్వంగా.

"ఓర్నీయమ్మ, అయితే చిటీ ముసలి దొరసానివయి పోతావేంటే సీతమ్మవ్వ? నీ చిన్నకోడలు కాలేజి సదువులు సదివిందంటగా, మరి మన ముతక సరుకును జేరసిత్తుందా?"

"ఓరి ఎదవన్నర ఎదవా, నా కొడుకు నన్ను తీసికెళ్ళుతుంటె అదెవత్తిరా మద్దె జేరనీయకపోటానికి?' గర్వంగా అంది.

సీతమ్మ హైద్రాబాద్‌కు వెళ్ళిపోతుందన్న సమాచారం వూళ్లో వాళ్ళందరికీ తెల్సింది. ఆడామగా అంతా వచ్చి పలకరించిపోతున్నారు. అందరితో, తను మళ్లీ ఈ వూరు వచ్చేది లేదని, హైదరాబాదులోనే చిన్న కొడుకు దగ్గరే వుండిపోతానని చెప్పుతున్నది. నోరారా అందర్నీ ఆప్యాయంగా పలకరించి, చేతారా

అందరికీ అదీ ఇదీ పెట్టే సీతమ్మ వూరొదిలి వెళ్ళిపోతుందంటే పాపం అందరికీ బాధగానే వుంది.

అన్న ప్రకారం వుదయానికి సీతమ్మ చిన్నకొడుకు రఘు హైదరాబాదు నుంచి వచ్చాడు. తల్లిని తీసుకుని మళ్ళీ పాయంత్రానికే ప్రయాణం కట్టాడు.

సీతమ్మను సాగనంపటానికి మొత్తం వూరు వూరే కదిలిందా అన్నట్లుగా ఆడా మగా చిన్నా పెద్దా అంతా ఒక పెద్ద గుంపుగా బయలుదేరారు. ఆ గుంపును చూసి రఘు విసుక్కున్నాడు. వాళ్ళంతా ఊరి పొలిమేరదాకా సీతమ్మతో కబుర్లాడుతూ వచ్చారు. వయస్సులో సీతమ్మతో సమవుజ్జీలయిన ముసలమ్మలయితే ఆమెను కౌగలించుకుని కన్నీరు పెట్టారు కూడా.

తన్నింత ఆప్యాయంగా చూసుకునే వూరును వదిలేసి పోవటం సీతమ్మ కిష్టం లేదు. కాని ఒక ప్రక్క, తనని తీసికెళ్లటానికి ఇన్నాళ్లికి తనంతట తాను వచ్చిన కొడుకు దగ్గర వుండాలనే వుబలాటం జాస్తిగా వుంది. పయిగా ఈ వయస్సులో, కాడి రమ్మనే రోజుల్లో, రోజా తృప్తిగా కన్న కొడుకులను కళ్ళారా చూసుకుంటూ కాలక్షేపం చెయ్యాలనే తపన ఆమెను ఈ ప్రయాణం కట్టించింది.

* * *

సీతమ్మను హైదరాబాదుకు తీసికెళ్ళిన మర్నాడే రఘు ఆమెను చూపించడానికి ఆసుపత్రికి తీసికెళ్ళాడు.

మిమ్మల్నందర్నీ చూచిన తర్వాత నా బాధలన్నీ పోయాయి. ఇప్పుడు నాకేం రోగం లేదు అంది; నాకే మందూ వద్దూ. అనవసరంగా ఆ డాక్టర్ల ఎదాన డబ్బులు పొయ్యడం దేనికీ, నేను ఆసుపత్రికి రానంటే రానన్నది. కాని, కొడుకూ కోడలు పట్టుపట్టారు.

నాకు వద్దు మొర్రో అంటున్నా వినకుండా చిన్నకోడలు తన తలకు నూనె రాసి, చిక్కుదీసి దువ్వి ముచ్చట ముడేసింది. వుతికిన సన్నచీర కట్టపెట్టింది.

"నీవు ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోపోతే ఎలాగత్తయ్యా? ఆయన ఎవరో పెద్ద డాక్టరుకు చూపిస్తానంటే పోనంటావేంటి?'' అని అంటూ మొగుడు తీసుకొచ్చిన ఆటోలో తనని చెయ్యి పట్టుకుని తీసికెళ్ళి కూర్చోపెట్టి, ఆసుపత్రికి సాగనంపింది.

సీతమ్మ మనసు ఆనందంతో నిండిపోయింది. చిన్న కొడుకూ, కోడలూ ఎంత మంచివాళ్ళు, తనకంటె వాళ్లకెంత ప్రేమా అని మనస్సులో తెగ మురిసిపోయింది.

రఘు ఆసుపత్రిలో ఆమెనొక బెంచీ మీద కూర్చోపెట్టి వెళ్లాడు. ఏవో ఫారాలు చేత్తో పట్టుకుని హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. కూర్చొని కూర్చొని సీతమ్మకు విసుగేసిపోయింది. మనూరోళ్ళు ఎవరైనా కనిపిస్తారేమోనని అక్కడున్న అందరి మొగాల వంకా పరీక్షగా చూసింది. "వీళ్ళ మనూరోళ్లు కాదటుంచి, మన దేశపోళ్ళు కూడా కాదు!'' అనుకుంది. అక్కడికీ ఎవర్నో పలకరించబోయింది. చిరాకుగా విదిలించుకున్నారు. 'ఓరి మీ దినాలు చెయ్యా!''అని అనుకుంది మనస్సులో.

మరో అరగంట తర్వాత రఘు వచ్చి ఆమెను ఎవరో డాక్టరు దగ్గరకు తీసికెళ్ళి చూపించాడు. ఆ డాక్టరు ఏవేవో పరీక్షలు చేశాడు. ఆమెను అవీ ఇవీ ప్రశ్నలు అడిగేడు. అన్నిటికి సమాధానం చెప్పి. "నీవు ఎవరబ్బాయివి బాబు! మా వూరోడివేనా?'' అని అడిగింది. ఆ డాక్టరు నవ్వి, "మీ వూరు కాదులెండి!'

' అన్నాడు. "ఏవూరోడివి అయితే ఏంలే! మంచోడులాగా వున్నావు. సూడ్నాయనా! నాకేరోగం లేదంటె మా చిన్నోడు వినకుండా నన్నీడకు లాక్కొచ్చాడు." అంది.

రఘు, "అబ్బ, నీవూరుకోవే!" అని ఆమెమీద విసుక్కున్నాడు.

"షి ఈజ్ పర్ఫెక్ట్లీ ఆల్‌రైట్. సర్టిఫికెట్ ఎలా ఇస్తా?" డాక్టరు నసిగేడు.

రఘు ఆ మాటకు కంగారుపడిపోయాడు. "కాదు డాక్టరు; ఆమె పైకి బాగానే వున్నా వుండి వుండి మమ్మల్ని హడావుడి జేసేస్తుంది. ఒక్కొక్కసారి మాట్లాడకుండా పడిపోతుంది. చాల కంగారుపెట్టేస్తుంది." ఇలా ఏవేవో చెప్పాడు. మధ్యలో సీతమ్మ ఏదో అనబోతే మాట్లాడవద్దని వారించాడు.

ఇలా చాలసేపు, చాలా రకాలుగా చెప్పిన తర్వాత ఆ డాక్టరు అయిష్టంగానే ఆ ఫారాల మీద సంతకాలు పెట్టి యిచ్చాడు.

బయటికొచ్చాక సీతమ్మ "ఏంట్రా చిన్నోడా, నేను వుండి వుండీ పడిపోతానా?" అంది ఆశ్చర్యంగా నోటిమీద వేలేసుకుని.

"వూరికే ఆయనతో అలా చెప్పాన్లేవే! అట్టా చెప్పకపోతే మంచి మందులు ఇవ్వరు" అన్నాడు. మరా కాగితాలేంటి అని అడిగింది. "ఈ కాగితాలు చూపిస్తే గాని మనకు వూరికే మందులు ఇవ్వరు. సరే ఇకపోదాం పద!" అని ఆటో పిలిచి కూర్చోపెట్టాడు.

"మరి మందులు తీసికోలేదా?" అని అడిగింది.

"సాయంకాలం నేను తీసికొస్తాలేవే!" అని విసుక్కున్నాడు.

ఆటో మోత వినగానే సీతమ్మ కోడలు సరోజ ఆదుర్దాగా బయటికొచ్చింది.

గుమ్మంలోనే "డాక్టరేమన్నారు. సర్టిఫికెట్ యిచ్చాడా?" అని అడిగింది కంగారుగా.

"చెప్తుతాలే, ముందు అమ్మ సంగతి చూడు!" అని గదిలోకి దూరాడు.

అతని వెనకాలే వచ్చి, "అబ్బ చెప్పండి చంపకా. ఇంతకీ సర్టిఫికెట్ యిచ్చాడా లేదా?" అని మొగుడు చెయ్యి పట్టుకుని ముద్దులు గుడుస్తూ అడిగింది.

భార్యను కాస్త సస్పెన్స్‌లో పెట్టాలని, "ఈ ముసలమ్మ రాయిలాగా వుంది, సర్టిఫికెట్ ఇవ్వటానికి వీల్లేదన్నాడు" అని అన్నాడు.

సరోజ తలపట్టుకుని మంచంమీద కూలబడిపోయింది. "ఈ ముసిల్ది వుక్కుముక్క లాగా వుంది. మన పనికాదురా దేముడాని" అని అంది దిగులుగా.

రఘు జేబులోంచి ఫారాలు బయటికి తీసి నవ్వుతూ వాట్ని పైకి ఎత్తి పట్టుకున్నాడు.

"అమ్మదొంగా, అదరకొట్టేశారే!" అని వుషారుగా మొగుడ్ని వాటేసుకుని ఆ ఫారాలు లాక్కుంది.

పాపం సీతమ్మ ఆకలితో నకనకలాడిపోతూంది. ఆమెకు పది గంటలవగానే కడుపులో ముద్ద పడాలి. గంట పన్నెండు దాటింది. పయిగా ఈ ఆసుపత్రి ఒకదానికి వెళ్లి వచ్చింది. ఆమెకు గేరు వచ్చినట్లు అయింది. వంటింట్లో పీట వాల్చుకుని కూలబడింది. కోడలు గదిలోకి దూరి బయటికి రావటం లేదు. అక్కడికీ "అమ్మాయి సరోజా!" అని నాలుగయిదుసార్లు పిలిచింది కూడా. సరోజ వున్న సంబరంలో ఈ పిలుపులు వినిపించుకోలేదు.

"అయితే మనకు ఇక క్వార్టరు వచ్చినట్లేనా? ఈ పాడు అద్దె కొంపలోంచి ఎప్పుడు బయటపడొచ్చు నంటరూ?" అని అడిగింది.

"అప్పుడేనా, ఈ ఫారాలు తీసికెళ్ళి ఆఫీసులో సబ్‌మిట్ చెయ్యాలి. వాళ్ళు వీట్ని స్క్రూటినీ చేసి, ఇతని తల్లి సీరియస్ కండిషన్‌లో వుంది కాబట్టి, ఈమెకు ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియదు కాబట్టి, ఇతను అదునుకు అందుబాటులో వుండాలి కాబట్టి, ఈమెకు మెడికల్ కేర్ అవసరం కాబట్టి, ఆఫీసు డిస్పెన్సరీకి దగ్గరగా, ఇతని ఆఫీసుకు దగ్గరగా ఈమెను వుంచాలి కాబట్టి - ఫలానా కోడ్‌లో ఫలానా సెక్షన్ ప్రకారం, ఫలానా ప్రిసిడెన్సీ ప్రకారం ఈయనకు అంటే ఫలానా సరోజ మొగుడికి - మామూలు ప్రయార్టీలో కాకుండా స్పెషల్ కేసుగా స్పెషల్ కోటాలోంచి క్వార్టరు ఎలాట్ చెయ్యాలి అని నోట్ పుటప్ చెయ్యాలి. దానిమీద పై అధికార్లు ఆర్డర్లు జారీ చెయ్యాలి. అప్పటికిగాని మనకు క్వార్టరు రాదు. మరీ అంత తొందరయితే ఎలా డార్లింగ్!" అన్నాడు నాటకీయంగా.

"తొందరకాకపోతే ఎలాగండీ? ఈ క్వార్టర్ కోసం కదా ఈ ముసలమ్మను తెచ్చి పెట్టుకున్నాం. ఎంత తొందరగా ఈ క్వార్టర్ వస్తుందా, ఎంత తొందరగా ఆ లాయారులాగా క్వార్టర్‌లో వున్న దొడ్లో కూరగాయలు పెట్టుకొని, కోళ్ళు పెట్టుకుని, ఒక గేదెను కొని పెట్టుకుని..."

"బజారు కూరలు కొనకుండా ఆ కూరలు తింటూ, ఇంకా మిగిలిన కూరలమ్ముకుంటూ ఆ కోడిగ్రుడ్లు అమ్ముకుంటూ, ఆ గేదెపాలు అమ్ముకుంటూ, ఆ గేదె పేడతో పిడకలు చేసి అమ్ముకుంటూ ఆ వచ్చిన డబ్బులన్నీ కూడపెట్టుకుని ఆ కనకవల్లి చేయించుకున్న నెక్లెస్‌లాంటి నెక్లెస్ చేయించుకుని, ఇదిగో యిక్కడ పెట్టుకుని..." భర్త నవ్వుతూ అన్నాడు.

"అబ్బ వదలండీ!"

* * *

మరో పదిరోజులకు గాని క్వార్టర్ ఎలాట్ కాలేదు. ఎలాట్ అయిన మూడో రోజుకే అద్దె యిల్లు ఖాళీ చేసేసి దాంట్లోకి మారిపోయారు. ఈ పదిరోజుల్లో సీతమ్మకు చిన్న కొడుకు ఇక్కడికి తనని ఎందుకు తీసికొచ్చాడో అర్థమయిపోయింది.

యిల్లు మారిపోయిన తర్వాత కోడలెంత మారిపోయిందో ఇంకా బాగా అర్థమయింది. ఇంకా ఆమె ఎక్కడ అర్థం చేసుకోలేదో అని కోడలు సూటిగా మాటలతోనే చెపుతున్నది.

ఈ ముసలమ్మను సాకుగా పెట్టుకుని సంపాదించుకున్న ఈ క్రొత్త ఇంటికి ఈ ముసల్ది దిష్టిబొమ్మయిపోయింది. ఈ ముసలమ్మ మూలంగా క్రొత్త యిల్లు చూడటానికి వచ్చే వాళ్ల ముందు తల కొట్టేసినంతగా బాధపడిపోతున్నారు పాపం భార్యాభర్తలు. తను వచ్చిన రెండు మూడు రోజుల వరకు ఎంతో ఆప్యాయంగా వేళ పట్టున భోజనం, ఫలహారాలూ అమర్చిపెట్టిన చిన్న కోడలు ఇప్పుడు. "అమ్మాయి, కాస్త అన్నం పెట్టవే!" అని తనచేత పదిసార్లు అడిగించుకున్నాక గాని విసుక్కుంటూ, సణుక్కుంటూ ఆ "కాస్తముద్ద" పడవేయటంలేదు. చిన్నకోడలు మంచితనం ఏమిటో సీతమ్మకు ఇప్పుడు బాగా అర్థమయింది.

ఈ క్వార్టర్‌లోకి వచ్చిన వారానికే సీతమ్మ చేత మళ్లీ ప్రయాణం కట్టించారు. నాకు రావటానికి వీల్లేదని ఒక్కదాన్నే బస్సు ఎక్కించాడు.

.... అడ్డరోడ్డు దగ్గర బస్సు దిగేసరికి సాయంత్రం అయిదుగంటలయింది. బస్సు దిగగానే సీతమ్మకు కళ్ళు తిరిగేయి. వళ్లు తూలి క్రింద పడబోయి ఆపుకుంది. రాత్రి ఎప్పుడో తిన్న తిండి. బెజవాడ బస్టాండింగ్‌లో మాత్రం రెండు జామపండ్లు కొనుక్కొని తిన్నది. ఇక్కడ్నుంచి రెండు మైళ్ళు నడిస్తేనే గాని వూరు రాదు. ఇంత దూరం నడిచే వోపిక లేదు. వూరికే దాహం వేస్తుంది. దగ్గర్లో ఎక్కడా నీళ్ళ జాడ కనిపించలేదు.

"ఓరి దేముడా, ఎంత కష్టం తెచ్చిపెట్టావురా!" అని అంటూ రోడ్డుప్రక్కన కూలబడింది.

ఆ మూగ ఎండలో రోడ్డుప్రక్క, ఆ దుమ్ములో కూలబడి, ఒక చిన్న మూట పెట్టుకుని వుస్సురుస్సురంటున్న సీతమ్మ వూర్నుంచి పిల్లలు తరిమికొట్టిన పిచ్చిదానిలాగా వుంది. పాలన్నీ త్రాగేసి పొదుగు కోసేసి అడవిలోకి తోలేసిన బక్కచిక్కిన ఆవులాగా వుంది. దొంగలు కొట్టిన వూరు లాగా వుంది.

ఇంతలో, "ఓర్నిమ్మ, మన సీతమ్మవ్వ లాగా వుండే? ఏంటీడుంది ఓ, ఓ....." అని అంటూ పగ్గం గట్టిగా లాగి బండి ఆపాడు బుల్లియ్య.

"ఏంటే, నీయమ్మ ముసల్దానా! ఈడ కూలబడ్డావు? పొలం నుంచి వస్తూ, నిన్ను చూచి నువ్వా కాదా అనుకుంటున్నా..." సీతమ్మ ప్రక్కన గొంతుక్కూర్చుని అన్నాడు.

"ఇప్పుడే బస్సు దిగి, వూళ్లోకి నడవటానికి వోపిక లేక ఇక్కడ కూలబడ్డారా! ఇంతలో దేవుడల్లే నీవు . వచ్చావు..."

"ఇంకే, మన బండి ఎక్కేయ్ మరి -" అని చెయ్యి పట్టుకుని బండిదాకా నడిపిస్తూ. "అయితే అయిదరాబాదు నుంచి వచ్చేసినట్టేనా! నీయమ్మో ఎళ్ళి నెలతిరక్కుండానే వచ్చేశావు ఏంటే? నీకా రోజే సెప్పానా లేదా, మన ముతక సరుకును ఆడ వుండనీయరే అని! ఇన్నావా? ఓ నా కొడుకో, నా కోడలో అని తెగ ఇదయిపోయావు. నీయమ్మ బాగయిందిలే. వూఁ ఎక్కెక్కు..." అని అంటూ రెండు చేతుల్తో సీతమ్మను అవలీలగా పైకెత్తి బండిలో కూర్చోపెట్టాడు."

"ఒరే బుల్లిగా, దాహం ఏత్తుందిరా?" అంది మెల్లిగా.

"మరింకే తాగేయ్!" అని తన బుర్రకాయలో నీళ్ళు యిచ్చాడు. ఆ నీళ్ళు త్రాగాక ఆమె ప్రాణం కుదుటబడింది. రవ్వంత ఓపిక వచ్చింది.

బండి వూరు వయిపు బయలుదేరింది.

బుల్లియ్య ఏదో మాట్లాడుతున్నాడు. సీతమ్మ చిన్నకొడుకు గురించి ఆలోచిస్తోంది.... 'ఆ జానెడు బెత్తెడు అద్దె కొంపలో యమ యాతన పడిపోయారు. ఈ యిల్లు సక్కగా వుంది. పోన్లే, నన్ను తరిమేస్తే తరిమేశారు. ఆళ్లకు సక్కటిల్లు అమిరింది. ఆళ్లు సుఖంగా వుంటే అంతే చాలు!' అనుకుంది.

మరి తల్లిమనస్సు అలా కాక ఇంకెలా అనుకుంటుంది?

- ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక, ఫిబ్రవరి *1976*

★